ఇంటి వద్దకే వైద్య సేవలు

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం
- ఆరోగ్య కేంద్రాల పరిధిలో చురుగ్గా సర్వే


లలితానగర్‌లో వృద్ధురాలికి బీపీ పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎం


రామకృష్ణానగర్‌లో సుగర్ టెస్ట్ చేస్తున్న ఏఎన్‌ఎం


శ్రీనివాసనగర్‌లో సర్వేను పర్యవేక్షిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసింది. ఇంటి వద్దే సేవలందేలా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) కార్యక్రమం ఉత్తర నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో అమలవుతోంది. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని సచివాలయాల్లో ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది.

ప్రతి సచివాలయానికి రెండు బృందాలు

విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయి. ఎనిమిదింట్లో ఈ నెల 17 నుంచి, నాలుగు సచివాలయాల పరిధిలో ఈ నెల 23 నుంచి సర్వే జరుగుతోంది. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14,412 గృహాల్లో నివసిస్తున్న 39,489 మంది జనాభాకు వైద్య సర్వే చేరువయ్యేలా ప్రతి సచివాలయానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో హెల్త్ సెక్రటరీ(ఏఎన్‌ఎం), ఆశా వర్కర్, ఏఎన్‌ఎం లేని చోట నర్సింగ్ స్టూడెంట్ పాల్గొంటున్నారు. నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 12 సచివాలయాల పరిధిలో గల 38,000 జనాభాకు సర్వే చేరువయ్యేలా మొత్తం 24 బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 18 నుంచి 5 సచివాలయాల్లో, 24 నుంచి ఏడు సచివాలయాల పరిధిలో సర్వే చేస్తున్నారు.

సర్వేలోని అంశాలు

సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి జ్వరం, బీపీ, సుగర్, థైరాయిడ్, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు, క్యాన్సర్, పక్షవాతం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ఎవరైనా బాధపడుతున్నారా అని సర్వే చేస్తున్నారు. 35 ఏళ్లు వయసు దాటిన వారికి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం ఉన్నవారికి మలేరియా రక్త పరీక్ష, మూడు రోజులు దాటి జ్వరం ఉన్నవారికి డెంగ్యూ పరీక్ష, దగ్గుతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి.. సర్వే వివరాలను సిబ్బంది యాప్‌లో పొందుపర్చుతున్నారు. వైద్య చికిత్స అవసరమైన వారికి టోకెన్లు మంజూరు చేస్తున్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

అక్కయ్యపాలెం విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో అక్టోబర్ 5 వరకు, నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో అక్టోబర్ 12 వరకు జేఏఎస్ సర్వే జరుగుతుంది. అక్టోబర్ 6న విద్యుత్‌నగర్ ఆరోగ్య కేంద్రం వద్ద, 13న నరసింహనగర్ ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. జేఏఎస్ సర్వేలో టోకెన్లు పొందిన వ్యాధిగ్రస్తులు వైద్య శిబిరాల్లో స్పెషలిస్ట్ వైద్యుల చేత వైద్య సేవలు పొందవచ్చు.

53వ వార్డులో జోరుగా సర్వే


శ్రీనివాస స్ట్రీట్‌లో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎం, సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జోరుగా సాగుతోంది. వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నారు. 298 సచివాలయం పరిధిలోని మద్రిపాలెం మసీదు వద్ద ఈ నెల 22న సర్వే ప్రారంభించినట్టు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ సచివాలయం పరిధిలోని 21 క్లస్టర్లలో కార్యక్రమం చేట్టారు. సోమవారం శ్రీనివాస స్ట్రీట్, మసీదు స్ట్రీట్, హుస్సేన్‌నగర్, గ్రీన్ గార్డెన్స్‌లో సర్వే నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఒక వేళ ఎవరికైనా వ్యాధి తీవ్రత ఉంటే వారికి టోకెన్లు మంజూరు చేసి, చికిత్స కోసం అక్టోబర్ 11న శివనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

రోజుకు 50 ఇళ్ల సర్వే



విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని 12 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన అంశాల ప్రకారం ఏఎన్‌ఎం, ఆశాలు ఇంటింటికీ వెళ్లి వ్యక్తుల ఆరోగ్య పరిస్థితి, వ్యాధుల వివరాలపై సర్వే చేస్తున్నారు. ప్రతి బృందం రోజుకు 50 ఇళ్లు సర్వే చేస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 50 నుంచి 70 టెస్టులు జరుగుతున్నాయి.

– డాక్టర్ డి.సుధీర్, వైద్యాధికారి, విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ

గణనాథుడిని దర్శించుకున్న కె.కె.రాజు


వినాయకుడి మండపంలో కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ గ్యాస్ గొడౌన్ వద్ద క్రియేటివ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని సోమవారం సాయంత్రం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు దర్శించుకున్నారు. ఆయన వెంట కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పలువురు నాయకులు ఉన్నారు.

విఘ్నేశ్వరుడి మండపం సందర్శన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌లో నరసింహనగర్ యూత్ కల్చరల్ స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.19.14 లక్షలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల ఆధ్వర్యంలో హుండీల ఆదాయం లెక్కించారు. అమ్మవారి దర్శనాలకు సంబంధించి 60 రోజులకు గాను రూ.19,14,187 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు. టర్నర్ చౌల్ట్రీ దేవదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్లకు అవగాహన


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామూర్తి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి సూచించారు. ఆశీలమెట్టలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి ఆటో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలో ఓవర్ లోడ్, సైడ్ సీట్‌లో ప్రయాణికులను కూర్చోబెట్టడం వంటివి చేయకూడదన్నారు. ట్రాఫిక్ రూల్స్, మెయిన్ రోడ్డులో సిగ్నళ్ల వద్ద డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు.

సీతమ్మధార రైతుబజార్‌లో కంటి వైద్య శిబిరం



రైతులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెథెస్థ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్లు భవాని, వీణ రైతులకు నేత్ర వైద్య పరీక్షలు చేసి తగు సూచనలిచ్చారు. రైతుబజార్ ఈవో కొండబాబు శిబిరాన్ని పర్యవేక్షించారు. సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై అనారోగ్యంతో మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం దరి సంజీవయ్య కాలనీలో బుద్ధ తులసీరాం(30) అనే వ్యక్తి భార్య పూనమ్‌తో కలిసి నివసిస్తున్నాడు. సదరు వ్యక్తికి మద్యం తాగే అలవాటు ఉంది. ఏ పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. తులసీరాం భార్య నగరంలోని ఓ ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇంట్లో కడుపుపొప్పితో భర్త బాధపడుతుండటం చూసి భార్య గట్టిగా కేకలు వేసింది. స్థానికులు గమనించి 108 వాహనానికి ఫోన్ చేసి అందులో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో తులసీరాం మృతిచెందాడు. పూనమ్ ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

కాలుష్య నిర్మూలన.. అందరి బాధ్యత


కార్యాలయానికి వెళ్లేందుకు బస్ బేలో వేచి ఉన్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మన సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలు విన్నారు. ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో మేయర్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు తమ ఉద్యోగులను వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించేలా సూచించాలన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆరు వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి, పరిశీలించారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్‌కు 04, యూసీడీకి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, టీపీఆర్వో ఏపీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 20 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పనుల పరిశీలన

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులను తహసీల్దార్ ఆనంద్‌కుమార్ పరిశీలించారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటికే ఆఫీస్‌లో ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.


స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

ఎస్పీ బాలుకు ఘన నివాళి


ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ బాలు తెలుగువారి సంపదని, భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన పాటలు ఎల్లప్పుడూ మనం వింటూనే ఉంటామన్నారు. ఈ సందర్భంగా బాలు నటించిన మిధునం చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జీ, అనూరాధ పాల్గొన్నారు.

సీనియర్ వాకర్ బ్రాహ్మణయ్య మృతికి సంతాపం


బ్రాహ్మణయ్య (ఫైల్)

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు, టెన్నిస్ పార్క్ మాజీ అధ్యక్షుడు బ్రాహ్మణయ్య(90) సోమ వారం తుదిశ్వాస విడిచినట్లు క్లబ్ కార్యవర్గ కమిటీ తెలిపింది. వాకర్స్ క్లబ్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే వారని, ఈయన మరణం క్లబ్‌కు తీరని లోటని పేర్కొంది. ఆయన కుటుంబానికి వాకర్స్ క్లబ్ తరఫున పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తదితరులు సంతాపం తెలియజేశారు. బ్రాహ్మణయ్య అంత్యక్రియలు మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. పాల్గొనే వారు ఉదయం 7.30 గంటలకు మురళీనగర్ వాకర్స్ పార్క్ వద్దకు రావలసిందిగా కమిటీ సభ్యులు కోరారు.

యువతతోనే దేశాభివృద్ధి

మద్దిలపాలెం: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఎస్.హరనాథ్ అన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన జాతీయ సేవా పథకం దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సేవా పథకంలో యువతీ, యువకులు పాల్గొనాలన్నారు. పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమమహేశ్వరరావు, టి.శ్యామ్యూల్ డేవిడ్ రాజు, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై అపస్మారక స్థితిలో మహిళ

- ఆర్పీఎఫ్, ఏయూటీడీ సహకారంతో కేజీహెచ్‌కు తరలింపు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న సుమారు 50 ఏళ్ల వయసు గల మహిళను సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బంది గుర్తించి ఏయూటీడీ సహకారంతో కేజీహెచ్‌లో చేర్పించారు. రైల్వే స్టేషన్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ మహిళ మాట్లాడలేని, ఆరోగ్యం సరిగా లేని, బలహీన స్థితిలో పడి ఉంది. ఆర్పీఎఫ్ సిబ్బంది గమనించి ఏయూటీడీ సంస్థకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆమె దుస్తులు మార్చి అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు


వేలంపాటలో దక్కించుకున్న లడ్డూతో రమేష్ దంపతులు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–7 భరణికాన రామారావు వీధిలోని సత్య రెసిడెన్సీ వద్ద సోమవారం వినాయక చవితి మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన లడ్డూ ప్రసాదం వేలంపాటలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రమేష్ దంపతులు రూ.15,001కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం విగ్రహ అనుపు కార్యక్రమం నిర్వహించారు.

వినాయక మండపంలో పూజలు


పూజలు చేస్తున్న మహిళా భక్తులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో శ్రీచక్ర బిల్డర్స్ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం మండపంలో స్థానిక మహిళలు పూజా కార్యక్రమాలు, భక్తి గీతాల భజన కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన సోమవారం ఉదయం ఆవిష్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆంధ్రా యూనివర్సిటీ, ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని వీసీ తెలిపారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు


పారామాత్మిక హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజాధికాలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి విష్వక్సేన, పుణ్యాహవచన, పంచవ్యారాధన, పంచాగవ్యాప్రాశన, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠాపన, ప్రధాన హోమాలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి అగ్నిధ్యానం, ప్రధాన హోమాలు, పంచకుంభ ఆరాధన, పవిత్ర అభిమంత్రణ, పారామాత్మిక హోమం, చతుర్వేద పారాయణం పూజలు చేశారు. పూజా కార్యక్రమాలన్నీ దేవస్థాన వేద పండితులు, అర్చకుల పర్యవేక్షణలో పెదపూడి రఘురామ్(విజయవాడ) నిర్వహించారు.

నేడు అంతరాలయ దర్శనాలు రద్దు

పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు అంతరాలయ దర్శనాలు నిలిపివేయనున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ఆ సమయంలో నిర్వహించే పంచామృతాభిషేకం నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణపతి హోమం


విజయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో విజయ గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో మహాగణపతి హోమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని విజయ గణపతికి ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, బర్కత్ ఈలీ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, యువజన విభాగం అధ్యక్షుడు శివగణేష్, కిరణ్‌రాజు, నీలి రవి, రాజాం రాజు, అంబటి శైలేష్, గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ పాల్గొన్నారు.

బాల గణపతిగా దుర్గాగణపతి


సీతంపేటలో పూజలందుకున్న బాల గణపతి


సతీష్‌కుమార్ ఆర్యకు లడ్డూను అందిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం బాల గణపతి అలంకరణలో దుర్గాగణపతి భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో స్థానికులు స్వామిని దర్శించి పూజలు చేసి, ప్రసాదాలు నివేదన చేశారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భరత నాట్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. మంగళవారం అర్ధనారీశ్వర గణపతి అలంకారంలో దుర్గాగణపతి దర్శనమిస్తారని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఆలయ ఈవో రమాభాయి తెలిపారు.

రూ.1.11 లక్షలకు లడ్డూ వేలం

వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాగణపతికి నివేదించిన 99 కిలోల లడ్డూకి సోమవారం సాయంత్రం వేలంపాట నిర్వహించారు. లడ్డూ దక్కించుకోడానికి పలువురు పోటీ పడ్డారు. చివరకు స్టీల్‌సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ ఎండీ సతీష్‌కుమార్ ఆర్య రూ.1.11 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చేతుల మీదుగా లడ్డూను సతీష్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్ సిటీ సెక్యూరిటీస్ చైర్మన్ కె.సత్యనారాయణ, డైరెక్టర్ పి.మధు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు 30 వరకూ ఫీజు గడువు

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్న ప్రైవేట్ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు ఫీజు చెల్లించి, కళాశాలలో తరగతులకు హాజరుకావడానికి ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.